# రివాజు



మల్లాది వెంకట కృష్ణమూర్తి

✷ పొకబయుటవున్న, గచ్చు అరుగుమీద కూర్చునున్న పోలయ్యకి వినపడుతున్నాయి, లోపలినుంచి మాటలు. చెవులోనుంచి, సగంలో ఆర్పేసిన పొగాకుతో చేసిన చుట్టని తీసి మళ్ల వెలిగించుకున్నాడు పోలయ్య, వాళ్లమాటలు వింటూ.

'ముసలాడికి, వుంచలేదా కూర?'

'వుంచలేదు. నువు నంజుకో, ముందర'

'ఇంకా ముసలాడికి అన్నం పెట్టలేదా?'

'తింటాడులే!'

'ఆకలి వేస్తుందేమో పాపం.'

'ఎందుకు వేస్తుంది ఆకలి? నీలాగా ఫేక్టరీకి వెళ్లి, నడుంవంచి పనిచేస్తున్నాడా ఏమన్నానా? పొద్దుగూకులు ఆ అరుగుమీద కూర్చోవటమేగా ఆయన పని, అసలు అరగాలిగా తిన్నది.'

'గట్టిగా అరవక వింటాడు.'

'వింటే విననీ, వున్నమాటేగా.'

కొడుకు కోడలు సంభాషణ విన్న పోలయ్య భావ గర్భితంగా నవ్వుకున్నాడు.

ముసలాడు తను. తిన్నది అరగదు. ఎంత తేలిగ్గా కోడలు అనగలిగింది ఆ మాటలు? తను ఇలా రోగిష్టిగా, జీవంలేని ముసలాడిగా కావటానికి కారణం ఎవరు? ఎందుకూ పనికిరాని చెరకు పిప్పిలా మారి పోవడానికి కారణం ఎవరు? ఆ సంగతి ఎవరూ ఆలోచించరే?

మమత. దేముడు మమత, ప్రేమ మనుషుల్లో సృష్టించాడు, తన కొడుకుల కోసరం. కుటుంబం కోసం జీవితం అంతా కష్టపడ్డాడు. తన రక్తాన్ని ధారపోసి, చెమటని ఓడ్చి డబ్బు సంపాదించాడు. ముసలి వాడయ్యాడు తను. చివరికి ముసలాడయ్యాడు, కొడుకు తృప్తిగా ఏ బాధలూ లేకుండా యౌవ్వనంలోకి అడుగుపెట్టగానే. ఆ గ్రహింపు, కృతజ్ఞతా లేదు వాళ్లలో. తనిప్పుడు ఎందుకూ పనికిరాని మనిషి.

మౌనంగా చుట్టకాలుస్తూ, లోపలనుంచి ఇంకా వినబడుతున్న మాటలని వింటూ కళ్లు మూసుకుని వుండి పోయాడు పోలయ్య.

'ఆ బండి అమ్మేస్తే పోలా? దాన్ని ఎందుకు అలా అనవసరంగా దొడ్లోవుంచడం? ఏ అగ్గి అంటుకున్నా బుగ్గయి పోతుంది.'

'ముసలాడు వినటంలేదుగా అది అమ్మితే మంచిదని చెప్పినా.'

'సరే. ఆయన మనమాట వినటం కూడానా? మనమే అమ్మేయాలి. బండి ఖరీదు కూడా రాదు ఇంకా ఆలస్యం చేస్తే.'

'చూద్దాం.'

'చూద్దాం అంటే, చూస్తూనే కాలం గడిచిపోతుంది. పిల్లది సమర్తాడే వయసులో వుంది. అది కాస్తా అయితే దాన్నో అయ్య చేతిలో పెట్టాలా? అప్పుడు డబ్బు అవసరం వస్తుంది. ఇప్పుడే ఆ బండిమీద వచ్చిన డబ్బు బేంకిలో వేసుకుంటె వడ్డీ వస్తుంది కూడా. ఆ బండి రూపంలో ఆ డబ్బంతా పడివుంటె ఏం లాభం?'

'సరే వీలు చూసుకుని కదుపుతాను.'

ముసలి పోలయ్య మనస్సు బాధతో నిండి పోయింది. ఆ బండివిలువ తెలియదు వీళ్ళకి. ఇప్పుడు తన కొడుకు ఇంత పెద్దవాడవగలిగాడంటె, ఆ బండిమీద వచ్చిన కిరాయి డబ్బుతోనే. తను బ్రతికుండగా అది అమ్మడానికి వీలు లేదు.

త్వరగా కేరియర్ సద్దు, ఇవాళ త్వరగా వెళ్ళాలి ఫేక్టరీకి, రాత్రి ఆలస్యంగా వస్తాను. వోవర్ టైం చేస్తాను ఈరాత్రి.'

'ఇదుగో. అయిపోయింది,'

పోలయ్య పక్కనుంచే వెళ్ళిపోయాడు, పోలయ్య కొడుకు. తండ్రిని గమనించనట్లుగానే, చేతిలో టిఫిన్ కేరియర్‌తో వెళ్తున్న కొడుకువంక చూస్తూండి పోయాడు పోలయ్య.

తను సవారీకట్టడం ఆపేసినప్పటి నుంచి ఎందుకో ఇలా మారిపోయాడు కొడుకు? భార్య బోధనలవల్లా లేక తను సంపాదించడం లేదనా? ఒంట్లో వోపిక వున్నంతకాలం తనూ సంపాదించలా? ఆ సంగతి ఎందుకు అంత త్వరగా మర్చి పోతారు?

కోడలు భోజనానికి, పిలుస్తుందను కున్నాడు పోలయ్య. పిలుస్తే భోజనానికి వెళ్ళాలి అనుకున్నాడు. బాగా ఆకలి వేస్తోంది. కోడలు భోజనానికి పిలుస్తేగాని వెళ్ళ కూడదను కున్నాడు.

సూర్యుడు నడినెత్తిమీదకి, వచ్చేసాడుగాని కోడలు కనబడలేదు ఎండ పడుతోంది ఇప్పుడు అరుగుమీద.

నెమ్మదిగాలేచి, అరుగు పక్కన వున్న చేతికర్ర అందుకుని, కొంచెం దూరంలో వున్న బండివైపు నడిచాడు. బండిదగ్గరే నిలబడి చూసాడు దానివంక.

తన భార్యకన్నా ఆ బండే ఎక్కువ పరిచయం తనకి. తన ఏభై ఏళ్ల జీవితంలో సగ భాగం ఆ బండిలోనే గడిచి పోయింది దాదాపుగా; ఎన్నిసార్లో విరిగి పోయింది. ఎన్నిసార్లో బాగు చేయించాడు. ఎన్ని రాత్రులో ఆ బండిలోనే పడుకున్నాడు.

ఇప్పుడు గుర్రం లాగడానికి లేదు. దాన్ని తోలేందుకు తనలో సత్తువ లేదు. అలా పడివుంది తనలాగా. అది జీవంలేని బండి కాబట్టి దాన్ని అమ్మేయవచ్చు. తను జీవం వున్నమనిషి కాబట్టి, చచ్చేదాకా వేచి వుండాలి.

ఆ బండికి మంచి గుర్రం కట్టి, మళ్లా ఆ బండిమీద సవారీ వెళ్ళాలని వుంది పోలయ్యకి. ఆర్థికంగానూ, శారీరకం గానూ తన కోరిక తీరడం కుదరదని తెలుసు.

'అన్నానికి.'

వినండీ, వినపడనట్లుగా కోడలు అన్న మాటలు విని వెనక్కి తిరిగాడు పోలయ్య.

వెనక్కి తిరిగి లోపలకి వెళ్ళిపోతోంది కోడలు, తనని పిలవటం అయిపోయి నట్లుగా. కర్ర సహాయంతో పాకలోకి వెళ్ళాడు పోలయ్య.

గంజినీళ్లు !

ఆకలిగా వుండటంవల్ల గబగబా ఆ గంజి నీళ్లే తాగాడు పోలయ్య.

మళ్లీ బయటకి వచ్చి కూర్చున్నాడు పోలయ్య, ఎండ పడని మరోచోట. ఏమి టిది ? ఎందుకు ఇంత పనికిరాని వాడుగా, అసహాయుడుగా అయిపోయాడు తను ? పోలయ్య మనసులో మళ్లీ కలుక్కుమంది బాధ.

కొడుకు రాగానే చుట్ట కొనుక్కునేందుకు డబ్బులు అడగాలి అనుకొన్నాడు, జేబులు తడుముకుని. కిళ్లీ కొట్టువాడు అప్పు ఇవ్వడం మానేసాడు, తన అసహాయత గమనించి.

చుట్ట తాగాలనే కోరికని బలవంతంగా అణుచుకున్నాడు. సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో కాఫీగ్లాసులు కడగటం చూసాడు మనమరాలు.

కాఫీ లేదు ఈ రోజుకి తనకు అను కున్నాడు మనస్సులోనే. కాఫీ లేకపోతే తలకాయనొప్పి వస్తుంది తనకి బాగా. దానికి తోడు ఓ చుట్టముక్క కూడా కరువయింది.

సిగ్గు విడిచి, లేచి వెళ్లి ఆరుగంటల ప్రాంతంలో కోడలిని అడిగాడు కాఫీ కావాలని.

కాఫీపొడి అయిపోయింది అన్న సమాధానం వచ్చింది వెంటనే.

కొద్దిగా వణుకు ప్రారంభం అయింది పోలయ్యలో. జ్వరం మళ్లీ వచ్చింది అని గ్రహించాడు వెంటనే. రోజూ సాయంత్రం వస్తుంది జ్వరం. రాత్రల్లా వుంటుంది. వుదయం వుండదు ఇవాళ ఎక్కువగా వుంది జ్వరం

వెంటనే పాకలో ఓమూల వున్న తన పక్కబట్టలు పరిచి పడుకున్నాడు పోలయ్య. దుప్పటి కప్పుకుంటే చలి, జ్వరం రెండూ ఎక్కువయినట్లుగా వున్నాయి.

కడుపులో ఆకలి. కాఫీ, చుట్ట లేక పోవటంవల్ల తలనొప్పి. వెంటనే నిద్ర పట్టేసింది పోలయ్యకి అయినా. బాధలు మరిపించే ఆనొప్పి కాస్తసేపు దూరంచేసే నిద్రలోకి జారిపోయాడు పోలయ్య.

కల. ఆ నిద్రలో ఓ కల. కలనిపించ లేదు పోలయ్యకు. నిజంగా జరుగుతున్నట్లు గానే వుంది.

బండి. అందంగా వున్న తన గుర్రబ్బండి అది. ఆ బండికి వో చక్కటి తెల్ల గుర్రం కట్టి వుంది ఆ గుర్రబ్బండిని తోలుతున్నాడు. వో పన్నెండేళ్ల కుర్రాడు. ప్రక్కనే కూర్చుని ఎవరో నేర్పిస్తున్నారు ఎలా గుర్రబ్బండి తోలాలో.

పోలయ్య గుర్తు పట్టాడు ఆ ఇద్దరినీ. తనూ, తన నాన్న. తను గుర్రబ్బండి ఎక్కిన మొదటిరోజు సంఘటన అది. చేతిలోని కొరడాని ఛళ్లు మనిపిస్తున్నాడు. గుర్రబ్బండి వేగంగా పరిగెత్తుతోంది.

క్రమంగా బండి వేగం తగ్గిపోతోంది. పూర్తిగా తగ్గి పోయింది. గుర్రం బండిని లాగలేక పోతోంది. బండిలోంచి కిందకి దిగాడు తను. బండికి కట్టివున్న ఆ తెల్ల గుర్రాన్ని విప్పేసాడు.

పోలయ్య తన రూపాన్ని మళ్లీ గుర్తు పట్టాడు, ఇప్పుడు పన్నెండేళ్లవాడు కాదు. ఇరవై అయిదేళ్లవాడు యువకుడు.

కాని గుర్రం ముసలిది అయిపోయింది. ఇక బండిని లాగే వోపిక, సత్తువ లేవు. ఆ గుర్రాన్ని తోలేసాడు తను.

సంక్రాంతి
బొమ్మల పేరంటం
పిలుపు కార్డులు
విజయవాడ, తెనాలి
గుంటూరు, హైదరాబాద్
నగరాలలో అమ్మకం

సంక్రాంతి గ్రీటింగ్ కార్డులతో పాటు ఈ ఏడు కొత్తగా బొమ్మల కొలువు పేరంటం పిలుపుకార్డులు, కానుక కార్డులుకూడా ప్రచురించాము. పేరంటం ఆహ్వానం కూడా అచ్చువేసి వున్నట్టివి. ఎవరికి కావలసినట్టుగా వారు ఆహ్వానం సందేశం అచ్చు వేసుకోడానికి వీలుగా వున్నట్టి ఖాళీ కార్డులు కూడా కలవు. అయితే వీటిని విజయవాడ, గుంటూరు, తెనాలి, హైద్రాబాద్ నగరాలలో క్రింద పేర్కొన్న వారు మాత్రమే అమ్ముతున్నారు.

*పరిసర ప్రాంతాలలోగల డీలర్లు మా సంక్రాంతి గ్రీటింగ్ కార్డులను కూడా వీరివద్ద కొనుక్కోవచ్చు.*

విజయవాడ
నవోదయ పబ్లిషర్సు,
ఏలూరు రోడ్, ఫోన్. 74500
మోడరన్ న్యూస్ ఏజెన్సీస్,
గవర్నరుపేట సెంటరు
గుంటూరు
కాస్మోస్ ట్రేడర్స్,
ఏలూరు బజారు, ఫోన్: 21167
తెనాలి
సరళా పబ్లికేషన్స్,
బోస్ రోడ్, ఫోన్. 499
హైదరాబాద్
మోడరన్ స్టేషనరీస్, అబిడ్స్ సర్కిల్
ఎలైట్ ట్రేడర్స్, 3-6-369/1, లిబర్టీ బిల్డింగ్ హైదరాబాద్-29 ఫోన్: 34084

**Script Arts**
8 State Bank Street, P.B. No. 2248
Mount Road, MADRAS 600002.

## రి వా జు

మళ్లీ బండి పరిగెత్తుతోంది ఇప్పుడు, మొదటిలోలాగా వేగంగా ఇప్పుడు సరికొత్తగుర్రం. ఆ గుర్రం మొహంమీద అందమయిన తెల్లనిమచ్చ. పాతగుర్రం దిగులుగా చూస్తోంది తనవంక. దాని జాలి చూపులు తనని కరగించలేదు.

మళ్లీ ఆ గుర్రం వేగం తగ్గిపోయింది. ఆ గుర్రాన్నీ తోలేసాడు బండి దిగి. ఇప్పుడు ముప్ఫైరెండేళ్లు పోలయ్యకి. మరో కొత్త గుర్రం. మళ్లీ మరో కొత్తగుర్రం. ఇప్పుడు నలభై మూడేళ్లు. జుట్టు కొద్దికొద్దిగా నెరుస్తోంది. బండికూడా పాతదయిపోయింది.

తర్వాత పోలయ్య రెండేళ్లక్రిందటి రూపం. చివరికీ గుర్రాన్ని కూడా తోలేసాడు, ఇదివరకటి లాగానే, నిర్దాక్షిణ్యంగా దాని ముసలితనంలో. కల మారింది.

పరిగెత్తాలి. తనని కొడుతున్నారు. ఎవరు ? ఎవరో కొడుతున్నారు. పరిగెత్తాలి. పారిపోవాలి. ఇదేమిటి ? తనతో పాటే దేన్నో లాగుతున్నాడు ? పారిపోతూ తనకి కట్టబడ్డ దేన్నో ఈడ్చుకు వెళ్తున్నాడు. ఏమిటది ?

తల వెనక్కి తిప్పిచూసాడు పోలయ్య పరిగెత్తుతూ.

బండి గుర్రబ్బండి. తన గుర్రబ్బండి. తన మెడకి, భుజాలకి కట్టారు బండిని. ఎవరు? దేనికీ ? ఎందుకు ?

పరీక్షగా చూసాడు బండిమీద కూర్చున్న ఆకారాన్ని. మసక, మసకగా వుంది ముందు. తర్వాత స్పష్టంగా కనిపించింది.

గుండె ఝల్లుమంది పోలయ్యకి. ఆ బండిమీద కూర్చుని, తనని కొరడాతో కొట్టేది గుర్రం! తను మొట్టమొదట సవారీ చేసిన తెల్లగుర్రం !!

'ఎందుకు ? నన్ను వదిలిపెట్టు'

అర్థించాడు పోలయ్య.

'నన్ను వాడుకుని, పీల్చి పిప్పిచేసి, నా ముసలితనంలో ఎందుకు నన్ను తరిమేసావ్ ? కసాయివాడు నన్ను పట్టుకోవడం చూసినా ఎందుకు వూరుకున్నావ్ ?' అడిగింది గుర్రం.

సమాధానం లేదు పోలయ్య దగ్గర.

'అందుకే పరిగెత్తు. పారిపో.'

ఛళ్లున కొరడాతో కొట్టింది మళ్లీ.

మళ్లీ పరిగెత్తుతున్నాడు పోలయ్య. ఒళ్లు తెలియని భయంతో పరిగెత్తుతున్నాడు పోలయ్య. క్రమక్రమంగా బండి బరువు పెరిగిపోయింది.

రొప్పుతూ ఆగి వెనక్కి తిరిగి చూసాడు పోలయ్య.

మళ్లీ గుండె ఝల్లుమంది.

నాలుగు గుర్రాలు ఇప్పుడు. తను ముసలితనంలో తరిమేసిన గుర్రాలు నాలుగూ బండిలో వున్నాయి ఇప్పుడు.

భీకరంగా సకిలించాయి పోలయ్యని చూసి. మళ్లీ పరిగెత్తుతున్నాడు భయంగా. వోపిక తగ్గిపోయింది. దాహం వేస్తోంది. చమటలు కక్కుతున్నాడు. కాళ్లు తేలిపోతున్నాయి. వూళ్లో అంతా తనని చూసి నవ్వుతున్నారు.

ఒక్కడుగు కూడా ముందుకి వేయలేక పోయాడు పోలయ్య, అలాగే పడిపోయాడు. నాలుగు గుర్రాలూ కొరడాలతో కొడుతున్నాయి లేవమన్నట్లుగా.

ఎవరో! ఎవరో అడ్డువచ్చారు; గుర్రాలని దూరంగా పంపేసారు. చేత్తో తన వంటిని సున్నితంగా నిమిరారు. బాధ, నొప్పి, ఆయాసం అంతా ఎగిరి పోయాయి. లేచి నిల్చున్నాడు వెంటనే. బండి కూడా లేదు ఇప్పుడు.

ఎవరు? ఎక్కడో చూసినట్లుందే. ఎక్కడ? గుర్తుపట్టాడు పోలయ్య ఆ ముసలి అవ్వని. వో రోజు ఎండా కాలంలో నడిరోడ్డుమీద శోషకొట్టి పడివుంటే, ఆ ముసలిదాన్ని తన బండిలో ఎక్కించుకుని హాస్పిటల్‌కి తీసుకు వెళ్లాడు తను, వుచితంగా. తర్వాత ఇంటికి చేర్చాడు.

చిన్నగా నవ్వింది ఆ ముసలిది. వెంటనే మాయమయింది అక్కడనుంచి. అయ్యో. దాహంగా వుంది. మంచినీళ్లు ... మర్చిపోయాడు తను.

లేచి కూర్చున్నాడు పోలయ్య, వోసారి చుట్టూ చూసాడు. పాక. లాంతరు వెలుగుతోంది. ఇంతసేపూ జరిగింది నిజంకాదు. కల. తను నిద్రపోయ్యాడు. ఆ నిద్రలో కల వచ్చింది. అంతే, అబ్బ ఎంత భయంకరమయిన కల. నిజంగా జరుగుతున్నటుగానే వుంది, కల కంటున్నంత సేపూ.

ఇంకా జ్వరం తగ్గలేదు పోలయ్యకి. ఒళ్లంతా నొప్పిగా వుంది. బాగా దాహం వేస్తోంది. లేచివెళ్లి, కూజాలోంచి మంచి నీళ్లు వంచుకుని తాగేశక్తి కూడా లేదు పోలయ్యలో.

అలా పక్కమీద కూర్చునే ఆలోచిస్తున్నాడు పోలయ్య. కలగురించి. ఆ గుర్రాంగురించి. అవి ముసలితనంలో తను తోలేసాక పడ్డ బాధగురించి. తన ముసలి తలితండ్రులను వయసులో వున్నప్పుడు తను ఎలా నిర్లక్ష్యంగా చూసిందీ గుర్తుకు వచ్చింది పోలయ్యకి.

ఎందుకూ పనికిరాని వస్తువంటే లోకంలో అందరికి అయిష్టం. విసిరేస్తారు. అదే ప్రాణమున్న జీవయితే తోలేస్తారు. తోలేయడం కుదరక పోతే ఆ వ్యక్తి చావు కోసం ఎదురు చూస్తూంటారు. మమత కన్నా డబ్బు ప్రాధాన్యం.

కొత్తేమీలేదు దీంట్లో, ఇది రివాజు. కేవలం రివాజు. మామూలు. పోకడ. అలవాటు. అంతే ఈ రివాజు కొత్త విషయంగా కనబడుతోంది తన వాడుకీ, తన విషయంలో అనుభవంలోకి రావడం వల్ల. కాని అనాలోచితంగా, రివాజుగా తమా ఎంతమందిని కష్టపెట్టాడు, తన కొడుకు కూడా ఈ రివాజుకు గురవుతాడు.

తన బాధ కొంత తగ్గినట్లుగా భావించాడు పోలయ్య. ఇప్పుడు తను పడుతున్న బాధలకి కారణం వుసురు. ఆ గుర్రాల వుసురు. తన ముసలి తలితండ్రుల వుసురు అంతే.

రేపు తన వుసురు కొడుక్కి, కొడుకు వుసురు మనమడికి అలా సాగి పోతూంటుంది. అలా సాగిపోవాలి.

ఎందుకంటె ఇది రివాజు. ●


# మైక్రోఫైన్డ్ ఆస్ప్రో

## త్వరగా కరుగుతుంది, త్వరగా ఇముడుతుంది

కనుకనే మామూలు బిళ్ళల కన్నా

## రెట్టింపు త్వరగా పనిచేసి నొప్పిని తొలగిస్తుంది.






మామూలు బిళ్ళల వలెగాక, **ఆస్ప్రో** అతి సూక్ష్మమైన అణువులు త్వరగా ఇముడుతాయి. నొప్పిని కలిగించే చోటుకు శీఘ్రగతిని చేరి సత్వర నివారణ కలిగిస్తాయి.

మైక్రోఫైన్డ్ **ఆస్ప్రో**ను: తలనొప్పి • ఒళ్ళు నొప్పి • జలుబు • ఫ్లూ • కీళ్ళ నొప్పులు • గొంతు నొప్పి • పంటి నొప్పులకు వాడండి

మోతాదు: పెద్దవారికి: రెండు బిళ్ళలు, అవసరమైతే మళ్ళీ వేసుకోండి. పిల్లలకు: ఒక బిళ్ళ లేక మీ డాక్టరు సలహా ప్రకారం వేసుకోవాలి.

## నొప్పిని అతి శీఘ్రంగా తొలగించడానికి ఆస్ప్రో మాత్రమే మైక్రోఫైన్డ్ చేయబడినది

నికోలస్ Ⓝ తయారు

A.G.57 TL